నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు మార్చి ఒకటో తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మూడో తేదీ నుంచి ద్వితీయ ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షల నిర్వహణకు ఇంటర్మీడియట్ బోర్డు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉదయం తొమ్మిది గంటలకు పరీక్ష ప్రారంభమై, మధ్యాహ్నం 12 గంటల వరకు ముగుస్తుంది. పరీక్షలకు జిల్లాలో 75 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, 40,356 మంది పరీక్షలు రాయనున్నారు. అందులో 22,789 మంది ప్రథమ సంవత్సరం విద్యార్థులు కాగా 17,567 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాస్తారు. 145 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న వారితో పాటు గతంలో పరీక్ష తప్పిన విద్యార్థులు సైతం పరీక్షలకు హాజరవుతారు.



నిరాశాజనకం

- వంశధార, ఆఫ్‌షోర్‌కు అరకొరగా నిధుల కేటాయింపు
- కరకట్టలు, ఇతర ప్రాజెక్టులు విస్మరణ
- ఫిషింగ్ హార్బర్లు, జెట్టీలకూ నిధులు కేటాయించని ప్రభుత్వం
- ఐటిడిఎ ఏర్పాటుపై లేని కనీస ప్రస్తావన
- జిల్లాలో కొబ్బరి, జీడి క్లస్టర్ల ఏర్పాటు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశాజనకంగానే ఉంది. జిల్లాను సస్యశ్యామలం చేస్తాం, ప్రతి ఎకరాకు నీరందిస్తామంటూ పలు సందర్భాల్లో హామీనిచ్చిన ప్రభుత్వం, కేటాయింపుల దగ్గరకొచ్చేసరికి నిధులు విదల్చలేదు. వంశధార, ఆఫ్‌షోర్ ప్రాజెక్టులకు అరకొరగానే నిధులు కేటాయించింది. మిగిలిన సాగునీటి ప్రాజెక్టులు, కరకట్టల పనుల జోలికి వెళ్లలేదు. పరిశ్రమలను ఏర్పాటు చేసి వలసలు నివారిస్తామంటూ పలు సందర్భాల్లో చెప్పిన ప్రభుత్వం, జిల్లాలో కొత్త పరిశ్రమల ఏర్పాటుపై బడ్జెట్‌లో కనీస ప్రస్తావన లేదు. బడ్జెట్‌లో రైతులకూ మొండిచేయి చూపింది. మొత్తమ్మీద ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని తరగతులనూ తీవ్రంగా నిరాశపరిచింది.

జిల్లాలో గత ఐదేళ్లుగా నిధులు కేటాయింపుల్లేక ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెడుతున్న తొలి బడ్జెట్‌లో ప్రాజెక్టులకు కాస్త నిధులు కేటాయింపులు ఉండొచ్చని అంతా ఆశించారు. బడ్జెట్‌లో కేటాయింపులు మాత్రం ఆ స్థాయిలో లేకపోవడంతో అంతా పెదవి విరుస్తున్నారు. ప్రధాన సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించింది. వంశధార ఫేజ్-2 స్టేజ్-2, ఆఫ్‌షోర్ ప్రాజెక్టులకు కొంతమేర నిధులు కేటాయించింది. వంశధార ప్రాజెక్టు స్టేజ్-2 ఫేజ్-2కు సంబంధించి 87, 88 ప్యాకేజీ పనులు, హిరమండలం రిజర్వాయర్, వంశధార-నాగావళి నదుల అనుసంధాన పనుల కోసం మొత్తం రూ.191.32 కోట్లు కావాలని అధికారులు ప్రతిపాదనలు పంపారు. బడ్జెట్‌లో రూ.182.53 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఇందులో పనులు, భూసేకరణకు రూ.167.15 కోట్లు కేటాయించింది. ఆర్ అండ్ ఆర్ కోసం రూ.10 కోట్లు, ఆర్ అండ్ ఆర్ పనుల కోసం మరో రూ.15.38 కోట్లు కేటాయించింది. ఆఫ్‌షోర్ పనుల కోసం రూ.167.68 కోట్లు అవసరమని ప్రతిపాదించారు. ప్రభుత్వం మాత్రం రూ.90.60 కోట్లను మాత్రమే కేటాయించింది.

ఇతర ప్రాజెక్టులకు పైసా కేటాయించని ప్రభుత్వం

జలవనరుల శాఖ ద్వారా చేపట్టనున్న సాగునీటి ప్రాజెక్టుల కోసం సుమారు రూ.480 కోట్లు అవసరం కాగా, ఒక్క పైసా కూడా ప్రభుత్వం విదల్చలేదు. పైడిగాం ఆధునీకరణ కోసం రూ.36 కోట్లు, ఒనిగెడ్డ ఆధునీకరణ కోసం రూ.12.50 కోట్లు కావాలని ప్రతిపాదనలు పంపారు. వాటికీ డబ్బులు ఇవ్వలేదు. గతేడాది ఈదుపురం సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు ఈదుపురం ఓపెన్‌హెడ్ ఛానల్ కోసం రూ.21 కోట్లు అవసరమని ప్రతిపాదించినా, వాటికీ కేటాయింపులు చేయలేదు. వంశధార, నాగావళి నదులపై కరకట్టల పనులు చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుత బడ్జెట్‌లో కనీసం వాటి ప్రస్తావనే లేదు.

కొబ్బరి, జీడి పంటలకు క్లస్టర్ల ఏర్పాటు

జిల్లాలో ప్రధాన ఉద్యాన పంటలైన కొబ్బరి, జీడి పంటలకు బడ్జెట్‌లో కొంత ప్రాధాన్యత ఇచ్చింది. కొబ్బరి, జీడి పంటల ఉత్పత్తి, ఉత్పాదకత పెంచేందుకు క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. జిల్లాలో 25 వేల మంది రైతులు 32 ఎకరాల్లో కొబ్బరి పంటలను సాగు చేస్తున్నారు. 47 వేల మంది 55 వేల ఎకరాల్లో జీడి పంటను సాగు చేస్తున్నారు. క్లస్టర్ల ఏర్పాటు ద్వారా రైతులకు అవసరమైన ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందించనుందని అధికారులు చెప్తున్నారు.

కౌలు రైతులకు చట్టంపై మరోసారి ప్రస్తావన

కౌలు రైతుల గుర్తింపు, రుణాలు అందజేత, సంక్షేమ పథకాల అమలుకు ఆంధ్రప్రదేశ్ సాగుదారుల హక్కుల చట్టం 2024 తీసుకురానున్నట్లు ప్రభుత్వం గతేడాది నవంబరులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రకటించింది. ప్రస్తుత బడ్జెట్‌లోనూ మరోసారి దాన్ని ప్రస్తావించింది. జిల్లావ్యాప్తంగా సుమారు 1.20 లక్షల మంది కౌలు రైతులు ఉన్నా, గత ఐదేళ్ల మొత్తం కలిపి 20 వేలకు మించలేదు. రానున్న ఖరీఫ్ నుంచి అమలు చేసే అవకాశమున్న నేపథ్యంలో ఎంతమందికి ప్రయోజనం చేకూరుతుందో చూడాల్సి ఉంది.

అన్నదాత సుఖీభవ అందరికీ అందేనా?

అన్నదాత సుఖీభవ కింద అందించనున్న సాయానికి కోత విధించడంతో పాటు కొందరికే పరిమితం చేసేలా ప్రభుత్వం తీరు కనిపిస్తోంది. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా రైతులకు సాయం కింద రూ.20 వేలు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం పిఎం కిసాన్ యోజన ద్వారా కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రూ.ఆరు వేలు సాయం అందిస్తున్న సంగతి తెలిసిందే. ఆ సొమ్ముకు రూ.14 వేలు కలిపి ఇవ్వనున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించింది. బడ్జెట్‌లో పథకం అమలు కోసం రూ.6,300 కోట్లు కేటాయించింది. జిల్లాకు సుమారుగా రూ.200 కోట్ల వరకు రావచ్చని ఒక అంచనాగా ఉంది. పిఎం కిసాన్ యోజన కింద గతేడాది అన్ని విడతలు కలిపి ఏడాదికి 2.29 లక్షల మందికి రూ.137 కోట్లు ఇచ్చారు. ఆ రైతులకే మరో రూ.14 వేలు కలిపి ఇవ్వచ్చని అధికారులు భావిస్తున్నారు. దీంతో సాయంపై భారీగా కోత ఉండొచ్చనే అనుమానాలు అందరిలోనూ వ్యక్తమవుతున్నాయి.

గొట్టాబ్యారేజీ నిర్వహణకు రూ.వెయ్యి

హిరమండలంలోని గొట్టాబ్యారేజీ నిర్వహణకు బడ్జెట్‌లో రూ.వెయ్యి మాత్రమే కేటాయించడం అధికారులను విస్మయానికి గురి చేసింది. జిల్లాలో అత్యంత కీలకమైన గొట్టాబ్యారేజీ మరమ్మతులు, ఇతర నిర్వహణ పనులకు అధికారులు రూ.రెండు కోట్లు కావాలని ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం మాత్రం రూ.వెయ్యి ఇచ్చింది. బ్యారేజీ నిర్వహణ కోసం వెచ్చించిన రూ.1.10 కోట్ల బిల్లులు ఏడాదికి పైగా పెండింగ్‌లో ఉన్నాయి.

గిరిజనులు, మత్స్యకారులకు నిరాశే

జిల్లాలోని గిరిజనులు, మత్స్యకారులకు ప్రభుత్వం బడ్జెట్‌లో మొండిచేయి చూపింది. మత్స్యకారులకు సబ్సిడీపై డీజిల్ అందిస్తున్నామని చెప్పిన ప్రభుత్వం సంతబొమ్మాళి మండలం భావనపాడు వద్ద ఫిషింగ్ హార్బర్, ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం వద్ద ప్రతిపాదించిన ఫిషింగ్ హార్బర్, వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేట వద్ద ప్రతిపాదించిన జెట్టీ నిర్మాణాలకు నిధులు కేటాయించలేదు. ఎన్నికల ప్రచారానికి జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేస్తామని హామీనిచ్చినా, బడ్జెట్‌లో కనీసం దానిపై కనీసం ప్రస్తావించలేదు.



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగింత తగదు

- కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి
- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు
- కలెక్టరేట్ వద్ద మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఆప్కాస్‌ను రద్దు చేసి మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించడం తగదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం, నగర అధ్యక్షులు ఎ.గణేష్ అన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఇవే డిమాండ్లతో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన మున్సిపల్ కార్మికులు కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ 17 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వ ఒప్పందాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ సిఫార్సులను ఆర్థిక శాఖ ఆమోదించకుండా కూటమి ప్రభుత్వం వెనక్కి పంపడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక అవుట్‌సోర్సింగ్ కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తామని, ఉద్యోగాలు పర్మినెంట్ చేస్తామని హామీనిచ్చారని గుర్తుచేశారు. ప్రభుత్వం కొలువుదీరి ఎనిమిది నెలలైనా హామీని నెరవేర్చలేదని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలన్నారు.

ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగిస్తామనడం అన్యాయమన్నారు. మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా పలురూపాల్లో నిరసనలు తెలిపామన్నారు. ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించడం వల్ల గతంలో అనేక సమస్యలు చవిచూశామని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు అత్యవసర సేవల ద్వారా తమ ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నారని, వారి హక్కులను రక్షించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. మున్సిపాల్టీలను పరిశుభ్రం చేసి, ప్రజల అవసరాలు తీర్చడమే గాక ప్రజారోగ్యాన్ని, పర్యావరణాన్ని పరిరక్షిస్తున్నారని తెలిపారు. పర్మినెంట్ కార్మికులకు రెండో శనివారంతో పాటు జాతీయ సెలవులు పూర్తిస్థాయిలో అమలు చేయాలని, కాంట్రాక్టు కార్మికులకు జాతీయ సెలవులు వర్తింపజేయాలని కోరారు. నగర పరిధిని దృష్టిలో పెట్టుకుని కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. పుష్ కాట్స్, బిన్‌లు, ఇతర పనిముట్లు వెంటనే అందించాలని, బళ్లు మరమ్మతులు చేయాలని, సమ్మెకాలపు ఒప్పందాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఫెడరేషన్ నాయకులు సిహెచ్.మురుగన్, కె.వెంకట్, మోహనరావు, ఎ.గురుస్వామి, డి.యుగంధర్, శంకర్ గణేష్, ఎ.జ్యోతిప్రసాద్, ఇంజినీరింగ్ విభాగ నాయకులు పి.మణికంఠ, పి.త్రినాథ్, బి.వెంకటరమణ, పి.శాంతి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

- వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. జిల్లాస్థాయి అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. తాగునీటి సరఫరాకు వేసవి కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని చెప్పారు. తాగునీటి కొరత వల్ల తాగునీటి వనరులు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ మొత్తాల పంపిణీని ఉదయం 7 గంటల నుంచి ప్రారంభించి సాయంత్రం 5 గంటలకు పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. ఈనెల నుంచి ఇదే విధానంలో పంపిణీ చేపట్టాలన్నారు. ఎం.ఎస్.ఎం.ఇ సర్వేకు ప్రాధాన్యత ఇచ్చి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజా, సిపిఒ ప్రసన్నలక్ష్మి, ఐసిడిఎస్ పీడీ శాంతిశ్రీ, డిపిఒ భారతి సౌజన్య, వ్యవసాయ శాఖ అధికారి కె.త్రినాథస్వామి, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



చక్రతీర్థ స్నానాలకు పోటెత్తిన యాత్రికులు (ఇన్‌సెట్‌లో ఉత్సవమూర్తులు)

చక్రతీర్థం... జనసంద్రం

వంశధార నదిలో యాత్రికుల స్నానాలు

ప్రజాశక్తి - జలుమూరు, శ్రీకాకుళం అర్బన్

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీముఖలింగేశ్వరుని చక్రతీర్థ స్నానాలకు యాత్రికులు పోటెత్తారు. శుక్రవారం నిర్వహించిన చక్రతీర్థ స్నానాలకు జిల్లా నుంచే కాక విజయనగరం, విశాఖపట్నం, ఒడిశా రాష్ట్రం నుంచీ యాత్రికులు వేలాదిగా తరలిరావడంతో వంశధార నది జనసంద్రమైంది. ఎల్.ఎన్ పేట మండలం మిరియాపల్లి, జలుమూరు మండలం శ్రీముఖలింగం మధ్య వంశధార నదిలో శ్రీముఖలింగేశ్వరునికి చక్రతీర్థ స్నానాలు వైభవంగా నిర్వహించారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో పార్వతీ పరమేశ్వరుల ఉత్సవమూర్తులను దక్షిణ ద్వారం నుంచి ఆలయ ప్రధాన అర్చకులు ప్రభాకర శర్మ, పెద్దలింగన్న ఆధ్వర్యాన ఆలయం నుంచి బయటకు తీసుకొచ్చారు. నంది వాహనంపై ఉంచి వేడుకలను ప్రారంభించారు. అనంతరం నంది వాహనంపై స్వామివారి ఊరేగింపు శ్రీముఖలింగం గ్రామంలో నిర్వహించారు. వేలాది యాత్రికుల కోలాహలం నడుమ ఉత్సవమూర్తులను మిరియాపల్లి రేవుకు చేర్చి చక్రతీర్థ స్నానాలు చేయించారు. మిరియాపల్లికి చెందిన లుకలాపు వంశస్థులు ఉత్సవమూర్తులకు క్షీరాభిషేకం నిర్వహించిన అనంతరం నదిలో చక్రతీర్థ స్నానాలు ప్రారంభమయ్యాయి. స్నానాల అనంతరం ఉత్సవమూర్తులను తిరిగి ఊరేగింపుగా శ్రీముఖలింగం ఆలయానికి తీసుకొచ్చారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి, ఎఎస్‌పి కె.వి రమణ, డిఎస్‌పిలు వెంకట అప్పారావు, వివేకానంద, మూర్తి పర్యవేక్షణలో సుమారు వెయ్యి మందితో పోలీసు బందోబస్తు నిర్వహించారు. సుమారు 70 వరకు రోప్ పార్టీలతో పాటు ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలను వినియోగించారు. ఆలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్‌లోని సిసి, డ్రోన్ కెమెరాల ద్వారా ఎస్‌పి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించారు. వంశధార నదిలో నాలుగు వరుసల పటిష్ట బారికేడ్లను ఏర్పాటు చేసి యాత్రికులు స్నానాలు చేసేలా ఏర్పాటు చేశారు. ఉత్సవమూర్తుల ఊరేగింపు సమయంలో స్వామి వారు నంది వాహనంపై ఆలయం నుంచి వంశధార నదికి వెళ్లేటప్పుడు సుమారు రెండు కిలోమీటర్ల మార్గాన రోప్ పార్టీ పోలీసులు సమయస్ఫూర్తితో విధులు నిర్వర్తించారు.

నేటి నుంచి కొత్త మెనూ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలతో పాటు కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కొత్త మెనూ శనివారం నుంచి అమల్లోకి వస్తుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు.

సోమవారం : అన్నం, ఆకుకూర పప్పు, ఉడకబెట్టిన గుడ్డు, చిక్కీ.
మంగళవారం : అన్నం, గుడ్డు కూర, రసం, రాగిజావ.
బుధవారం : వెజ్ పలావు, ఆలు కూర్మా, ఉడకబెట్టిన గుడ్డు, చిక్కీ.
గురువారం : అన్నం, సాంబరు, గుడ్డు కూర, రాగి జావ.
శుక్రవారం : చింతపండు పులిహార, చెట్నీ (గోంగూర లేదా కూరగాయలతో), ఉడకబెట్టిన గుడ్డు, చిక్కీ.
శనివారం : అన్నం, కాయగూర కూర, రసం, రాగి జావ, స్వీట్ పొంగల్.

బడ్జెట్‌తో దగా బట్టబయలు

వైసిపి జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్

ప్రజాశక్తి - పోలాకి

భారీగా అప్పుల అంచనాతో బడ్జెట్ ప్రవేశపెట్టిన కూటమి ప్రభుత్వం.. మళ్లీ అన్ని వర్గాలను దగా చేసిందని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలకు మంగళం పాడే విధంగానే ఈసారి బడ్జెట్‌ను రూపొందించారని ఆరోపించారు. సంక్షేమం పేరుతో కోతల నాటకానికి తెర తీసిందని పేర్కొన్నారు. ఎన్నికల హామీలను గాలికొదిలేసిందని విమర్శించారు. మహిళల మహాశక్తి, నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు ప్రయాణానికి పైసా ఇవ్వని ప్రభుత్వం.. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, దీపం పథకాలకు భారీగా కోత విధించిందని తెలిపారు. అప్పులతోనే అమరావతిని కడతామని కూటమి ప్రభుత్వం ప్రకటించిందని పేర్కొన్నారు. ఎన్నికల్లో డ్వాక్రా మహిళలకు 10 లక్షల వరకు సున్నా వడ్డీ రుణాలు ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం.. ఇప్పుడా హామీని బడ్జెట్‌లో ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు.

నమ్మించి నట్టేట ముంచారు

వెలుగు కార్యాలయం వద్ద బాధితుల ఆందోళన

ప్రజాశక్తి - కవిటి

మత్స్యకార ఎఫ్‌పిఒ సమావేశం పేరుతో వెలుగు సిబ్బంది తమని పిలిచి, మత్స్య సంపద అభివృద్ధికి సాయం చేస్తామని చెప్పి తమకు ఉపయోగం లేని యంత్రాలు అందించి ఇప్పుడు ముఖం చాటేస్తున్నారని మండలంలోని కపాసుకుద్ది, కొత్తపాలెంకు చెందిన పలువురు మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన యంత్రాలకు గానూ అసలు వడ్డీతో సహా చెల్లించాలని బ్యాంకు అధికారులు తమకు నోటీసులు పంపించారని తెలిపారు. తమకు అందించిన యంత్ర పరికరాలతో సహా వెలుగు కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కాయ పురుషోత్తం, బడే చిరంజీవి తదితరులు మాట్లాడుతూ తాము వెలుగు ఆధ్వర్యంలో కొనసాగుతున్న మత్స్యకార ఎఫ్‌పిఒలో సభ్యులుగా ఉన్నామని తెలిపారు. మత్స్య సంపద ఎండబెట్టుకునేందుకు ఎటువంటి రుసుము లేకుండా యంత్ర పరికరాలు అందిస్తామని చెప్పి తమ వద్ద సంతకాలు తీసుకున్నట్టు తెలిపారు. ఆ తర్వాత తమకు యంత్ర పరికరాలు అందించారని, ఒక్కో యంత్రం రోజుకు 50 కిలోల చేపలు ఆరబెడతాయని చెప్పారని, కనీసం ఐదు కేజీలు కూడా ఆరబెట్టేందుకు పనికిరాకుండా ఉన్నాయని వాపోయారు. వెంటనే ఆ విషయాన్ని వెలుగు కార్యాలయంలో తెలియజేసినా స్పందించలేదన్నారు. ఇప్పుడేమో బ్యాంకు ద్వారా తమకు ఒక్కొక్కరికి సుమారు రూ.లక్ష వరకు చెల్లించాలని నోటీసులు వచ్చినట్లు తెలిపారు. తాము రోజువారీ చేపలు అమ్ముకుంటూ బతికేవారిమని, ఇలా లక్షల్లో కట్టమంటే తమ వల్ల కాదని తేల్చిచెప్తున్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. ఆందోళనలో బడే నారాయణమ్మ, కర్రి రామలక్ష్మి, చీకటి తులసమ్మ, దాసరి కమలమ్మ, చీకటి సోదులమ్మ, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



వెలుగు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మత్స్యకారులు



మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

పారాలీగల్ వాలంటీర్లకు శిక్షణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రజలకు న్యాయ విజ్ఞానం అందించడంతో పాటు అందుతున్న న్యాయ సేవలను వివరించాల్సిన బాధ్యత పారాలీగల్ వాలంటీర్లపై ఉందని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. ఈనెల 24 నుంచి నిర్వహించిన పారాలీగల్ వాలంటీర్ల శిక్షణా కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యాన న్యాయసదన్‌లో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు చట్టాలపై పూర్తి అవగాహన కల్పించడంలో పాటు అందరికీ న్యాయం అందుబాటులో ఉండాలన్నది ప్రదాన ఉద్దేశమన్నారు.

పిల్లల, ఆస్తి, కుటుంబ వివాదాల చట్టాలు, క్రిమినల్ చట్టాలు, నల్సా అసంఘటితరంగ కార్మికుల స్కీమ్, గృహహింస చట్టం, పని ప్రదేశాల్లో మహిళలపై హింస చట్టాలు, లింగ నిర్ధారణ తదితర చట్టాలు, పథకాలపై ప్రభుత్వ అధికారులు, న్యాయవాదులు శిక్షణ ఇచ్చారు. వీరికి ప్రభుత్వ కార్యాలయాల్లో విధులను ప్రత్యక్షంగా చూపించారు. అనంతరం వారికి గుర్తింపు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్ర

- మార్కెట్లతో పాటు సహకార రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం
- మద్దతు ధరల చట్టం తీసుకురావాలి
- 5న కలెక్టరేట్ వద్ద ధర్నా
- సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కుట్ర పన్నుతోందని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ తాండ్ర ప్రకాష్, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.సింహాచలం, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెలమల రమణ, పోలాకి ప్రసాదరావు విమర్శించారు. నగరంలోని సుందరయ్య భవనంలో రైతు సంఘాల సమన్వయ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ల గుప్పిట్లో పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం డిజిటల్ అగ్రి మిషన్, నేషనల్ ఫ్రేమ్ వర్క్ ఆన్ అగ్రికల్చర్ మార్కెట్స్ పేరుతో కొత్త విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. వీటివల్ల దేశవ్యాప్తంగా వ్యవసాయ మార్కెట్లు, సహకార రంగాన్ని నిర్వీర్యం చేసి బహుళ సహకార వ్యవస్థ అమలుకు సిద్ధమవుతోందని తెలిపారు. దీనికి వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఈనెల ఐదో తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ధర్నాలో రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు, గిరిజనులు, వృత్తిదారులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం సి2 ప్లస్ 50 శాతం ఫార్ములా ప్రాతిపదికన రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర స్థిరీకరణకు వీలుగా మద్దతు ధరల చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. రైతులకు రుణమాఫీ చేసి, సమగ్ర పంటల బీమా అమలు చేయాలన్నారు.



మాట్లాడుతున్న రైతుసంఘాల నాయకులు

ఘనంగా జాతీయ సైన్స్ డే


నరసన్నపేట: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం


ఆమదాలవలస : సైన్స్ ప్రయోగాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-సరుబుజ్జిలి

మండలంలోని వెన్నెలవలస గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో 2023 - 24 సంవత్సరంలో 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఐటిడిఎ సిఎంఒ చల్ల చిరంజీవిరావు సత్కరించారు. శుక్రవారం జాతీయ వైజ్ఞానిక దినోత్సవం సందర్భంగా గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సైన్స్ ప్రాజెక్టులను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. అలాగే 10వ తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన చీమల సాయి శృతి, మండంగి కీర్తన, పత్తిక విజయలకు సిఎంఒ తన వ్యక్తిగత ఆర్థిక సహాయాన్ని బహుమతులుగా అందించి సాలువులతో సత్కరించి ప్రోత్సహించారు. ఈ ఏడాది జరగనున్న పదో తరగతి పరీక్షల్లో గిరిజన బాలికలు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బి.ఉమ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే రొట్ట వలస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ డే సందర్భంగా సివి రామన్ చిత్రపటానికి ఇన్‌ఛార్జి హెచ్ఎం రమణమూర్తి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

లావేరు: మండలంలోని బుడుమూరు ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. జీవశాస్త్ర ఉపాధ్యాయుడు పూజారి గోవిందరావు శాస్త్రీయ దృక్పథంను కలిగి ఉండాలని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. సి.వి.రామన్ చిత్ర పటానికి పూలమాల వేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళ్లర్పించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రాజెక్టులను పరిశీలించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. విద్యార్థులందరికీ పెన్నులు బహుకరించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉరిటి శ్రీనివాసరావు, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు ప్రసాదరావు, ఉపాధ్యాయులు కె.వెంకటరావు, పడాల తమ్మినాయుడు, కె.చిన పెంటయ్య, కె.చంద్రశేఖర్, ఎస్, రమేష్ బాబు పాల్గొన్నారు.

అరసవల్లి: స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాలలో 'నేషనల్ సైన్స్ డే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ జి.నాగేశ్వరరావు (మాజీ వైస్ ఛాన్సలర్, ఆంధ్ర యూనివర్సిటీ) హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సైన్సు ప్రాజెక్టులు, పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లను ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శంకర నారాయణ, అకాడమిక్ కో-ఆర్డినేటర్ సిహెచ్.కృష్ణారావు, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ ఎస్.పద్మావతి, టి.స్వర్ణలత, పి.సూర్య సునీత, పి.లలిత పాల్గొన్నారు.

నరసన్నపేట: స్థానిక రవీంద్ర భారతి పాఠశాలలో సైన్స్ ఎక్స్పో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చల్లా అనిల్ కుమార్ ఎండి, రేడియాలజిస్ట్, చల్లా కృషి గైనకాలజిస్ట్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దిలీప్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఎంఎస్ మణి, నార్తాంధ్ర జోనల్ ఇన్‌ఛార్జి ఎన్.వెంకటేష్, పాఠశాల ప్రిన్సిపాల్ ధర్మాన వాసుదేవరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు ఆహుతులను ఎంతగానో అలరించాయి.

అలాగే శ్రీ జ్ఞాన జ్యోతి స్కూల్‌లో సైన్స్ డే సందర్భంగా సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ, ద్వితీయ బహుమతులను ప్రధానం చేసి సైన్స్ ఉపాధ్యాయులను సన్మానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల మేనేజ్‌మెంట్ వెలమల భాస్కరరావు, బోర రామారావు, తర్ర సత్యనారాయణ, పాగోటి లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణంలోని భవిత పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టులను పలువురిని ఆలోచింపజేశాయి. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు సంధ్య, గాయత్రీ, పాఠశాల కరస్పాండెంట్ సువారి మురళీధరరావు, డైరెక్టర్ సునీత, హెచ్ఎం వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండలంలోని కొర్లకోటలోని సన్‌రైజ్ పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కళాధర్, పూర్ణిమ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కవిటి: మండలం సహలాలపుట్టుగ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయి ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు నగదు బహుమతులతో పాటు మెమొంటోలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ధనుంజయ మజ్జి, ఉత్తరాంధ్ర ఒడియ డిఐ దుర్గాప్రసాద్ చౌదరి, ఒడియా లింగ్విస్టిక్ మైనారిటీ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ పాడి, అపోట రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్ పాడి, అపోటా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బృందావన్ దోలై తదితరులు పాల్గొన్నారు. అలాగే కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కుసుంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కవిటి కొత్తూరు ఆర్ష విజ్ఞాన భారతి, కల్యాణి ఆంగ్ల పాఠశాలల్లో సైన్స్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముందుగా సివి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం విద్యార్థుల రూపొందించిన పలు వైజ్ఞానిక ప్రదర్శనలు పరిశీలించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మల్లేశ్వరరావు, బివికె, కల్యాణి ఆంగ్ల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం అనిల్, బిందుమాధవి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పలాస: మండలంలోని బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ముందుగా సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఉత్తమ ప్రాజెక్టులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా సైన్స్ ఉపాధ్యాయులు రమేష్, శ్రీనివాసరావు, సుధాకుమారి, పద్మ, చంద్రశేఖర్, శివప్రసాద్, మెహర్ సుధ, కృష్ణవేణిలను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎస్.వి. రమణారావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీసత్యసాయి విద్యావిహార్‌లో

మండలం రామకృష్ణాపురం వద్ద ఉన్న శ్రీసత్య సాయి విద్యావిహార్ విద్యార్థులు 108 సైన్స్ ప్రాజెక్టులు తయారు చేసి ఆహుతులను అబ్బురుపరిచారు. ఈ కార్యక్రమానికి ట్రాన్స్‌కో సీనియర్ అకౌంటెంట్ జి.లింగరాజు హాజరై విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మల్ల రామేశ్వరరావు, ఉప అధ్యక్షులు తలసు శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి, ఉపాధ్యాయులు సూర్యతేజ, రుషికేష్, అశోక్, అరుణ, చిన్నారావు, సంతోష్, కళ్యాణి, మాధురి, జ్ఞానేశ్వరి, స్రవంతి, అనుదీప్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టెక్కలి: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా వివిధ పాఠశాలల్లో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. మండలంలోని నర్సింగపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయులు బడగల ప్రమీల, సకలాభత్తుల శ్రీనివాసరావు పర్యవేక్షణలో నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం దొంకాన పాపారావు, ఉపాధ్యాయులు రోణంకి విజయ్‌కుమార్, వెంకటరమణ, చిన్నవాడు, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ వి.లూక్‌పాల్, డాక్టర్ బేపల సతీష్‌కుమార్, రాంబాబు, రమణ మూర్తి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. అమ్మఒడి పాఠశాలలో కరస్పాండెంట్ బరాటం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులు చేసిన ప్రాజెక్టులు ఆలోచింపజేశాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దామోదరరావు, రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

రవీంద్రభారతిలో

స్థానిక రవీంద్రభారతీ పాఠశాలలో సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్ పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో డీన్ నాగరాజు, ప్రిన్సిపాల్ ఎం.పద్మజ. ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఓక్లాండ్‌లో

స్థానిక ఓక్లాండ్ అంతర్జాతీయ పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు అబ్బురపరిచాయి. ప్రిన్సిపాల్ మళ్లా మధులత, పరిశీలకులు లక్ష్మణరావు విద్యార్థుల్లో ఉన్న శక్తిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మండలంలోని కోలిగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైన్స్‌డేను హెచ్ఎం నరేంద్రనాథ్ పట్నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్ఎంసి చైర్మన్ శ్రీకాంత్ మహంతి వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించారు. కార్యక్రమంలో బయాలజీ ఉపాధ్యాయులు రవికుమార్, తేజేశ్వరరావు, మిను, నిలిపి, సోమేష్, పాపారావు, శ్రీనివాస, జ్యోతి, పద్మావతి, రేణుకా, అమితా, స్వప్న రాణి, చంద్ర వదన్ పాల్గొన్నారు.

రణస్థలంరూరల్: మండలంలోని ఆర్డర్ స్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా సి.వి.రామన్ చిత్రపటానికి ఎంఇఒ త్రినాథరావు, పాఠశాల డైరెక్టర్ వి.ప్రవీణ్, అకాడమిక్ అడ్వైజర్ వి.వి.రమణ, మధుసూదనరావు, ప్రిన్సిపాల్ గారపాటి అరుణ పూలమాల వేసి నివాళ్లర్పించారు. విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శివరాజు, కో-ఆర్డినేటర్ గిరిజ భవాని, ఉపాధ్యాయులు బాలాజీ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించినట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ వై.పోలినాయుడు తెలిపారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం.వి.సత్యనారాయణ, రసాయన శాస్త్ర విభాగాధిపతి డి. ఆదినారాయణ, అధ్యాపకులు ప్రదీప్, రవీంద్ర, రవిశంకర్, రఘురాం, రామకృష్ణ, హరిత, అరుణ్ కుమారి, రవిబాబు, రవికుమార్, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

గీతాంజలి స్కూల్‌లో

సైన్సు, సాంకేతిక రంగాల అభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలని గీతాంజలి స్కూల్ వ్యవస్థాపకులు సనపల ఉమాదేవి పిలుపునిచ్చారు. సైన్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈవేడుకల్లో విద్యార్థులు తరగతుల వారీగా సైన్సు ప్రాజక్టులను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బొడ్డేపల్లి పద్మజ, సైన్సు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


టెక్కలి : ఓక్లాండ్ విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టు


ఇచ్ఛాపురం : వైజ్ఞానిక ప్రదర్శనను పరిశీలిస్తున్న హెచ్ఎం


శ్రీకాకుళం అర్బన్ : సి.వి రామన్ చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న ఉపాధ్యాయులు

వజ్రపుకొత్తూరు: పెదవంక ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం ఢిల్లేశ్వరరావు ఆధ్వర్యంలో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు ఆవిష్కరణలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

కొత్తూరు: మండలంలోని మెట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్ఎం డి.లక్ష్మీ నరసింహ సైన్సు ఉపాధ్యాయులు టి. హేమలత కుమారి, బి.వెంకటరమణ, బి. పోలి నాయుడు, ఎం. సూర్యారావు, కె.రామకృష్ణారావు, టి.శారదలను సన్మానించారు.

పొందూరు: మండలంలోని లోలుగు కెజిబివి, తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. కెజిబివి విద్యార్థులు చేపట్టిన సైన్స్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తాడివలసలో సైన్స్ ఉపాధ్యాయులు గోపాలశెట్టి సాయికుమార్, రావాడ పాపారావులు విద్యార్థులచే చేపట్టిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రేజేటి సౌమ్య, హెచ్ఎం బల్ల కంటయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కెజిబివిలో పరీక్ష రాస్తున్న పదో తరగతి విద్యార్థులు

విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచడమే లక్ష్యం

ప్రజాశక్తి- పొందూరు

అధ్యయనం - పోరాటం నినాదాలతో నాటి నుంచి నేటి వరకు విద్యార్థుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తూ, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం - శాస్త్రీయ ఆలోచన పెంచుతూ దేశంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఎస్ఎఫ్ఐ గుర్తింపు పొందిందని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు చిత్తిరి రాజు అన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మండలంలోని కెజిబివి పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం ప్రజ్ఞా వికాస పరీక్షను నిర్వహించారు. పరీక్షలపై విద్యార్థుల్లో భయాందోళనలను తొలగించాలనే ఉద్దేశంతో ప్రతిఏటా ఈ విధంగా ప్రజ్ఞ వికాస్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈ పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రేజేటి సౌమ్య, ఉపాధ్యాయులు, ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద నిరోధంపై అవగాహన

టెక్కలి రూరల్: టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం మెకానికల్, ఇఇ విద్యార్థులకు నిర్వహించిన అగ్నిప్రమాద నిరోధ అవగాహన శిక్షణలో విశాఖపట్నానికి చెందిన సన్రైజ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైర్ అండ్ సేఫ్టీ ట్రైనర్ జి.భాస్కర్ పాల్గొని అవగాహన కల్పించినట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కంపెనీల్లో, విద్యుత్ కేంద్రాల్లో జరిగే అగ్ని ప్రమాదాలు, ఎలక్ట్రికల్ సార్ట్‌సర్క్యూట్ వలన కలిగే ప్రమాదాలను నివారించుటకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అనంతరం వివిధ రకాల (ఫైర్ డిస్ట్రిబ్యూటర్) పరికరాన్ని వినియోగించి మంటలను ఆర్పే విధానాన్ని విద్యార్థులకు చూపించి వాటి వినియోగాన్ని విద్యార్థులతో స్వయంగా చేయించినట్లు డైరెక్టర్ పేర్కొన్నారు. ఈ శిక్షణలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ పిఒ ఎస్.వి.మారుతీ ప్రసాద్, కో-ఆర్డినేటర్లు లోకనాథం, జగదీశ్వరరావుతో పాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


శంకరరావు మాస్టారును సన్మానిస్తున్న ఎంపిపి తదితరులు

ఆయనో 'గెస్ట్'.. అతనే రికార్డులకు 'బెస్ట్'

ప్రజాశక్తి- కవిటి

'గెస్ట్' స్వచ్ఛంద సంస్థ ద్వారా జిల్లా వ్యాప్తంగా ఎన్నో సామాజిక కార్యక్రమాల్లో పాల్గొన్న బల్లెడ శంకరరావు వృత్తి విద్యా ఉపాధ్యాయునిగా ఒకే పాఠశాలలో 40 ఏళ్లు పనిచేసి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించడం ఆయనకే చెల్లిందని ఎంపిపి కడియాల పద్మ అన్నారు. బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వృత్తి విద్యా ఉపాధ్యాయునిగా పనిచేసిన బల్లెడ శంకరరావు పదవీ విరమణ కార్యక్రమం గురువారం పాఠశాల ఆవరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాలలోనే 40 ఏళ్ల పాటు ఉపాధ్యాయునిగా పనిచేసిన ఘనత దక్కించుకున్న ఏకైక వ్యక్తి శంకరరావు మాస్టారు అని కొనియాడారు. ఎంఇఒ ధనుంజయ్ మజ్జి, సర్పంచ్ బెందాళం శ్రీరామ్ ప్రసాద్ మాట్లాడుతూ ఒక ఉపాధ్యాయునిగా ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దిన శంకరరావు మాస్టారు గెస్ట్ అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి గెస్ట్ శంకరరావుగా ఎంతోమందికి ఆదర్శనీయంగా నిలిచారని కొనియాడారు. ఆయన విశ్రాంత జీవితం ప్రశాంతంగా సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపిటిసి దుద్ది సతీష్, మాజీ ఎంపిటిసి బెందాళం విజయ్, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ శ్రీపతి, బల్లెడ జయప్రకాష్, హెచ్ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిటిఎఫ్ బృందం సందర్శన

పోలాకి: డిస్టిక్ టాస్క్‌ఫోర్స్ కమిటీ పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించింది. జిల్లా గణాంకాధికారి వి.రామనాగేశ్వరరావు, పి.మురళి, ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎన్ఆర్‌హెచ్ఎం శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వివిధ రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. బడి పిల్లలు, బడి చదవని బడిఈడు పిల్లల హిమోగ్లోబిన్ స్థాయిని మదింపు చేస్తూ వారికి తగిన ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు, ఇతర ఆహారం కోసం అవగాహన కల్పించి ఆరోగ్య వంతులుగా తీర్చిదిద్దడంలో క్షేత్రస్థాయి పారామెడికల్ ఉద్యోగుల పనితీరును సమీక్షించారు. అదే విధంగా ఆర్‌సిహెచ్ పోర్టల్‌లో గర్భిణీ నమోదు, శిశు నమోదు, సేవల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో మదింపు చేస్తూ మాతా శిశు మరణాల నివారణ లక్ష్యంగా ఈ సందర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఎఎన్ఎం, ఆశా కార్యకర్తల రికార్డులను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. జిల్లా గణాంకాధికారి రామనాగేశ్వరరావు మాట్లాడుతూ శాస్త్ర స్థాయి ఉద్యోగుల రికార్డులను తనిఖీ చేయడం జరిగిందని, వివిధ సేవల మదింపులు పిహెచ్‌సి పనితీరు సంతృప్తికరంగా ఉందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి డా. నల్లి రవికుమార్, శేఖర్‌బాబు, బరాటం లక్ష్మి, కృష్ణవేణి, సోమేశ్వరి, సిహెచ్ వోలు, రమణమ్మ, కుమారి, నాగమణి సుజాత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు విజ్ఞానంలో భాగంగా శుక్రవారం నరసన్నపేట మండలం మడపాం పేపర్‌మిల్లుని సందర్శించారు. కర్మాగారంలో పేపర్ తయారీని విద్యార్థులు నిశితంగా పరిశీలించారు. మార్కెటింగ్ విధానం, తయారీ, అమ్మకం, కొనుగోళ్లు, లాభనష్టాలు వంటి విషయాలను కంపెనీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. వాణిజ్య రంగంలో రాణించాలనుకుంటే మెలకువలు అవసరమన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ వి.లూక్‌పాల్, ఆధ్యాపకులు హేమరాజ్, మల్లేశ్వరరావు, లోకేశ్వరరావు, తేజోవతి తదితరులు పర్యవేక్షించారు.

రోడ్లు, కాలువల నిర్మాణాలకు నిధుల మంజూరు

ఆమదాలవలస: మండలంలోని పంచాయతీల్లో సిసి రహదారులు, కాలువల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు టిడిపి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. మండలంలోని పలు గ్రామాల్లో 94 పనులకు రూ.846 లక్షల నిధులు ఎన్ఆర్‌జిఎస్ నుంచి మంజూరైనట్లు జిల్లా కలెక్టర్ ప్రొసీడింగ్స్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్రకటనలో పేర్కొన్నారు. సిసి రహదారులు, కాలువల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసిన సిఎం చంద్రబాబు, పంచాయతీ రాజ్ మంత్రి పవన్ కళ్యాణ్‌కు ఎమ్మెల్యే రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికల కోడ్‌తో కౌన్సిల్ సమావేశం వాయిదా

ఇచ్ఛాపురం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండడంతో కౌన్సెల్ సాధారణ సమావేశం వాయిదా వేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి తెలిపారు. శుక్రవారం చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరగాల్సిన సాధారణ సమావేశం ఎన్నికల కోడ్‌తో వాయిదా పడింది. సమావేశానికి హాజరైన సభ్యులు మినిట్స్ బుక్‌లో సంతకాలు చేసి బయటకి వచ్చారు. మున్సిపల్ కమిషనర్ రమేష్, కౌన్సెల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వీర జవాను కుటుంబానికి రివార్డు


రాజేష్ (ఫైల్)

నౌపడ: సంతబొమ్మాళి మండలం చెట్ల తాండ్ర గ్రామానికి చెందిన వీర జవాన్ డొక్కరి రాజేష్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల రివార్డును ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేసింది. గతేడాది జూలై 17న జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలోని దోడా జిల్లాలో జరిగిన ఉగ్రవాద కాల్పుల్లో ఆర్మీ జవాన్ రాజేష్ తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆ కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటామని హామీఇచ్చారు. ఈ మేరకు ప్రభుత్వం రివార్డు ప్రకటించడంతో జవాన్ తల్లి డొక్కరి పార్వతి ప్రభుత్వానికి, మంత్రి అచ్చెన్నాయుడుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

'పది' విద్యార్థులకు పరీక్షా సామగ్రి వితరణ

ప్రజాశక్తి- కొత్తూరు

మండలం కడుము జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం జి.తిరుమలరావు అధ్యక్షతన శుక్రవారం పాతపట్నానికి చెందిన రామరాజు ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారశెల్లి రామరాజు ఆధ్వర్యంలో 48 మంది పదోతరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు పెద్దలపై గౌరవభావాలతో మెలిగి, వారి ఆశీస్సులతో గొప్ప భవిష్యత్‌ను పొందాలన్నారు. రామరాజు మాట్లాడుతూ మన ప్రత్యక్ష దైవాలు, ఎల్లవేళలా మన బాగును కోరుకునేవారు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులేనన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు దార జ్యోతిని ట్రస్ట్ తరపున ఘనంగా సన్మానం చేసి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ కిలారి రమేష్, విద్యాకమిటీ మెంబర్ వి.రమాదేవి, కె.సుజాత, ఆర్.తవిటమ్మ, ఎం హైమావతి, ఉపాధ్యాయులు పెయ్యల రాజశేఖరం, బండారు గాయత్రి, వల్లూరు లక్ష్ము నాయుడు, శివకల శ్రీవాణి, బత్తుల వినీల, పడాల సునీల్, జన్ని చిన్నయ్య, కుదమ తిరుమలరావు, ముదిల శంకరరావు, కింజరాపు నిర్మలాదేవి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు విడుదల

సత్ఫలితాన్నిచ్చిన శిరీష హస్తిన పర్యటన

ప్రజాశక్తి- పలాస

ఎన్నో ఏళ్ల పలాస కాశీబుగ్గ జంట పట్టణ వాసుల కల నెరవేరింది. కాశీబుగ్గలో అర్ధంతరంగా నిలిచిన ఫ్లైఓవర్ బ్రిడ్జ్ పనులకు కేంద్ర ప్రభుత్వం శుక్రవారం నిధులు విడుదల చేసింది. ఈ మేరకు రైల్వే మంత్రిత్వశాఖ జిఒ విడుదల చేసింది. కూటమి ప్రభుత్వం ఆవిర్భవించాక ఈ ప్రాంతం అభివృద్ధికి అహర్నిశలు శ్రమించే ఎమ్మెల్యే గౌతు శిరీష ఆ బ్రిడ్జిని పూర్తి చేయాలనే దీక్ష... ఆమె పట్టుదల... కృషి సత్ఫలితాన్నిచ్చింది. ఇందుకు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సహకారం ఎనలేనిది. ఈ ఫ్లైఓవర్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసి, ఈ ప్రాంత ప్రజల ప్రయాణ కష్టాలను తొలగించేందుకు కేంద్ర రైల్వేమంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను ఢిల్లీలో కలిసి విజ్ఞప్తులందించారు. ఆమె చిత్తశుద్ధితో అడుగులు వేయడంతో రైల్వేశాఖ నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా రూ. 46.64 కోట్ల సవరించిన అంచనాలతో పూర్తిగా రైల్వేశాఖ చేపట్టేలా జిఒ విడుదలవ్వడంపై కూటమి నాయకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు

టెక్కలి: ఈ నెల 8న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం జరిగేలా చూడాలని టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక కోర్టు సమావేశ మందిరంలో న్యాయవాదులతో మాట్లాడారు. రాజీకి అనుకూలమైన కేసులపై ఇరువర్గాల వారితో చర్చించి రాజీ కావాలని కోరారు. ఇందుకు న్యాయవాదులంతా సహకరించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు దివ్వల వివేకానంద, న్యాయవాదులు ఖజానా వెంకటరావు, దవళ రాజేశ్వరరావు, సాయిరాజ్, వైకుంఠరావు పాణిగ్రాహి, పేడాడ చంద్రశేఖర్ ఆజాద్, అద్దాల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వాహన ఫిట్‌నెస్ స్థలాన్ని మార్పు చేయాలి


మాట్లాడుతున్న శంకర్ రెడ్డి


ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రవాణాశాఖ ఉత్తర్వుల మేరకు ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట, బారువ, మందస ప్రాంతాలకు చెందిన వాహనాలు, లారీలు, ఆటో తదితర వాహనాలు ఫిట్నెస్ కోసం 140 కిలో మీటర్లు దూరంలో జర్పించుకోవాలని చెప్పడంతో ట్రక్ ఆపరేటర్లు ఆందోళన వ్యక్తం చేశారు. రవాణాశాఖ అధికారులు తక్షణమే ఫిట్నెస్ స్థలాన్ని మార్పు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై స్థానిక యూనియన్ నాయకులు రవాణాశాఖ కార్యాలయ వద్ద ఆందోళన చేపట్టి వినతిపత్రం అందజేశారు. అయినా రవాణాశాఖ అధికారులు యూనియన్ల అభ్యర్థన పట్టించుకోలేదు. దీంతో పట్టణంలో అన్ని యూనియన్ల అత్యవసర సమావేశం ఏర్పాటు చేసుకొని భవిష్యత్ ప్రణాళిక రూపొందించుకొని సమస్య పరిష్కారం అయ్యేంత వరకు పెద్దఎత్తున ఆందోళన చేయడానికి నిర్ణయించారు. అధికారులు ఉత్తర్వులు సడలించి గతం మాదిరిగా ఇచ్ఛాపురంలో ఫిట్నెస్, బ్రేక్ జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కొండ శంకర్ రెడ్డి, మోహన్ రెడ్డి, ఎర్రయ రెడ్డి, చంద్ర మోహన్, నారాయణ, సంజు సాహు, శాంతారావు, ప్రదీప్ దాస్, మోహనరావు, వి.రవి, కట్టా సూర్యప్రకాష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్ఫోసిస్‌కు 'కాకినాడ ఆదిత్య' విద్యార్థులు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ఆర్ట్స్ కాలేజ్ రోడ్డులోని కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలకు చెందిన 12మంది డిగ్రీ విద్యార్థులు బెంగళూరుకు చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ ఇన్ఫోసిస్‌కు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.వి వేణుగోపాల్ తెలిపారు. వారికి ఏడాదికి రూ.2.2 లక్షల వార్షిక వేతనం చెల్లించేందుకు సంస్థ ప్రతినిధులు అంగీకరించారని చెప్పారు.కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో వీరిని ఎంపిక చేశారని వివరించారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ సుగుణా రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ బి.ఇ.వి.ఎల్ నాయుడు, విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, కళాశాల డైరెక్టర్ బి.ఎస్ చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ జి.జి.వి సుబ్రమణ్యం, ప్లేస్‌మెంట్ అధికారి ఆర్.రాజు అభినందించారు.


ఎంపికైన కాకినాడ ఆదిత్య విద్యార్థులు

నాగావళి నదిలో వ్యక్తి మృతి


మృతుడు రాము

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని తోటపాలెం జంక్షన్ నీలమ్మ కాలనీలో నివాసముంటున్న యాదవరెడ్డి రాము (40) నగరంలోని గుజరాతీపేట సమీపాన నాగావళి నదిలో పడి మృతి చెందాడు. మృతుడు స్వస్థలం కొత్తూరు మండలం బత్తిలి గ్రామం. ఆయన గత కొన్నేళ్లుగా స్థానికంగా ఉంటూ తోపుడు బండిపై పండ్లు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతునికి ఇద్దరు భార్యలు, నలుగురు పిల్లలున్నారు. గత కొంతకాలంగా మానసికంగా బాధపడుతున్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు. గురువారం రాత్రి కూడా నాగావళి నది ఒడ్డున గల కోటేశ్వరస్వామి ఆలయ పరిసరాల్లో ఆయన కనిపించాడని స్థానికులు చెబుతున్నారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 1వ పట్టణ ఎస్ఐ హరికృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి అనంతరం మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.


స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు, కారు

అక్రమ మద్యం పట్టివేత

ఇచ్ఛాపురం: ఒడిశా నుంచి వస్తున్న అక్రమ మద్యం రవాణాపై ఎక్సైజ్ మొబైల్ పార్టీ ఆకస్మిక దాడులు చేపట్టి అక్రమంగా ఒడిశా నుంచి వస్తున్న 5 బాక్సులు, 60 బీర్ సీసాలు తరలిస్తున్న కారు సీజ్ చేసి మద్యం సీసాలు స్వాదీనం చేసుకున్నట్టు మొబైల్ ఎక్సైజ్ సిఐ జి.వి.రమణ తెలిపారు. మొబైల్ సిబ్బంది విఠలేశ్వరరావు, శ్రీనివాస్‌తో దాడుల్లో భాగంగా ఒడిశా నుంచి అక్రమంగా తరలిస్తున్నమద్యం, కారును స్వాదీనం చేసుకుని సోంపేట మండలం కొర్లాం గ్రామానికి చెందిన వ్యక్తిపై కేసు నమోదు చేయటం జరిగిందన్నారు. పట్టుబడిన మద్యం విలువ సుమారు పదివేలు ఉంటుందన్నారు.


మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

పెండింగ్ దరఖాస్తులు పూర్తి చేయాలి

పలాస: టౌన్ ప్లానింగ్ విభాగంలో పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని కమీషనర్ రామారావు అన్నారు. శుక్రవారం పురపాలక సంఘం కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి కమిషనర్ అధ్యక్షతన ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఈ సమావేశంలో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని, ఆక్రమణ పన్నులు, అడ్వర్టైజ్మెంట్ పన్నులను శతశాతం వసూలు చేయాలని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

108లో గర్భిణి ప్రసవం

కొత్తూరు: పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం మండ దేసరి గూడకు చెందిన సవర సరస్వతి పురిటి నొప్పులతో బాధపడుతుండగా ఆమె కుటుంబ సభ్యులు కొత్తూరు 108 సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఆ గ్రామానికి చేరుకొని గర్భిణీని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో నొప్పులు ఎక్కువ కావడంతో ఇఎన్‌టి రాము, పైలెట్ ఎస్.లక్ష్మణరావులు ప్రసవానికి సపర్యలు చేపట్టారు. దీంతో ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది.



అభినందిస్తున్న ఎస్‌పి మహేశ్వరరెడ్డి

ఆరోగ్యవంతమైన జీవనాన్ని సాగించాలి

ప్రజాశక్తి– శ్రీకాకుళం అర్బన్

పోలీసుశాఖలో కానిస్టేబుల్ స్థాయి నుంచి సుమారు 33 ఏళ్ల పాటు వివిధ హోదాల్లో సేవలు అందించి, శుక్రవారం ఉద్యోగ విరమణ పొందిన జలుమూరు ఎఎస్ఐ బి.లక్ష్మీ నారాయణను జిల్లా ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి సత్కరించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయనకు శాలువకప్పి జ్ఞాపికను అందజేశారు. ఆయన కుటుంబ సభ్యులను ఎస్‌పి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీస్‌శాఖలోకి ప్రవేశించిన నాటి నుంచి నేటి వరకు అహర్నిశలు ప్రజల కోసం సేవలందించిన లక్ష్మీ నారాయణ విధి నిర్వహణలో ఎక్కడా ఎటువంటి ఇబ్బందులకు తావు లేకుండా సమర్థవంతంగా పని చేశారన్నారు. ఉద్యోగ విరమణ బాధ కలిగించినా కుటుంబ సభ్యులతో కలిసి జీవించే అవకాశం దక్కుతుందన్నారు. ఆరోగ్యవంతమైన జీవనాన్ని కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి కె.వి. రమణ, డిఎస్‌పి ఎల్ శేషాద్రి, పరిపాలనాధికారి సిహెచ్ గోపీనాథ్, ఎఎస్ఐ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరరావుకు సన్మానం

ప్రజాశక్తి– శ్రీకాకుళం అర్బన్

నగరపాలక సంస్థలో టౌన్ ప్లానింగ్ అధికారిగా పని చేస్తూ ఉద్యోగ విరమణ చేస్తున్న ఉమామహేశ్వరరావును శుక్రవారం ఆర్ట్స్ కళాశాల మైదానంలో స్టార్ వాకర్స్ సత్కరించారు. నగర ప్రజలకు ఆయన అందించిన సేవలను ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. భవిష్యత్ కాలాన్ని ఆరోగ్యవతంగా సాగించాలని సూచించారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరాప్రసాద్, పీజీ గుప్తా, శాసపు జోగినాయుడు, బి.వి.రవిశంకర్, గుడ్ల జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

పలాస: నేషనల్ అప్రెంటిస్ షిప్ ట్రెనింగ్ స్కీం (ఎన్ఎటిఎస్) కింద స్వయం సహాయక సంఘాల సభ్యులు, వారి కుటుంబ సభ్యుల కొరకు ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన శిక్షణా కార్యక్రమానికి దరఖాస్తులు కోరుతున్నామని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు అన్నారు. ఈ శిక్షణకు అర్హత గల వారితో కమిషనర్ శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ దరఖాస్తుదారులు 2021–2025 మధ్యలో డిగ్రీ పూర్తి చేసి ఉండాలని, ఇందులో రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులకు ఆశ సొసైటీ ఆధ్వర్యంలో శిక్షణను ఆన్‌లైన్ ద్వారా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణకు ఎంపికైన వారికి నెలకు రూ.4,500 చొప్పున ఏడాదికి రూ.54 వేలు స్టైఫండ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణలో ఉపాధి నైపుణ్యాలు, జీవన నైపుణ్యాలు, వ్యవస్థాపకత శిక్షణ మొదలగునవి ఉంటాయన్నారు. ఈ ట్రెనింగ్ పూర్తయిన తర్వాత టెస్టులో పాసైన వారికి ఎన్ఎస్‌డిసి సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందని, ఈ సర్టిఫికెట్ ద్వారా ఉద్యోగాలు పొందుటకు అవకాశం ఉందన్నారు. మరిన్ని వివరాలకు మెప్మా విభాగానికి వచ్చి సంప్రదించాలని కోరారు.



రాజాం రోడ్డులో జెసిబితో చేస్తున్న జంగిల్ క్లియరెన్స్


రాజాం రోడ్డులో జంగిల్ క్లియరెన్స్

లావేరు: రోడ్లు, భవనాల శాఖ పరిధిలోని పలు రహదారులకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ పనులు జరుగుతున్నాయని ఆశాఖ జెఇ ఆంజనేయరాజు తెలిపారు. రణస్థలం నుంచి రాజాం రోడ్డు జంగిల్ క్లియరెన్స్ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారులకు ఇరువైపుల పిచ్చిమొక్కలు, తుప్పలు లేకుండా రహదారి కనిపించేలా ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఈ పనులు చేపట్టినట్లు ఆయన చెప్పారు. లావేరు, రణస్థలం, ఎచ్చెర్ల, జి.సిగడాం మండలాల్లోని 15 రోడ్లలో జెసిబితో ఈ పనులు చేస్తున్నట్లు చెప్పారు.

ఫైలేరియా రోగులకు ఎఫ్ఎంఎం కిట్లు

ప్రజాశక్తి – శ్రీకాకుళం అర్బన్

ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.వి బాలమురళీకృష్ణ అన్నారు. నగరంలోని ఆదివారంపేట పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఫైలేరియా రోగులకు ఎఫ్ఎంఎం కిట్లను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైలేరియా (బోదకాలు) రోగులకు ఫైలేరియా మార్బిలిటి మేనేజ్‌మెంట్ కిట్లు వల్ల ఎంతో ప్రయోజనం ఉందన్నారు. కిట్‌లో టబ్, జగ్, సబ్బు, టవల్, అయిట్మెంట్ ఉంటాయని, వాటిని వినియోగించుకోవాలన్నారు. ఇంటి వద్దే డ్రెసింగ్ చేసుకునేందుకు వీలవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి పి.వి సత్యనారాయణ, వైద్యాధికారి హరినాయుడు, పారా మెడికల్ ఆఫీసర్ వాన సురేష్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కిట్లు అందజేస్తున్న డిఎంహెచ్ఒ బాలమురళీకృష్ణ

బాధితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి– పలాస

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో సర్వే నంబర్ 51లో ఉన్న పేదల ఇళ్లు, ఇళ్ల స్థలాలను కూల్చివేయడం సరికాదని, ఇళ్ల స్థలాలు కోల్పోయిన బాధితులకు న్యాయం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్. గణపతి, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు వంకల మాధవరావు, సిపిఐ పలాస నియోజకవర్గ కార్యదర్శి చాపర వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం ముందు బాధితులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూది కొండ ప్రాంతంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని, అయితే అక్కడ నివసిస్తున్న పేద ప్రజలకు ప్రత్యామ్నాయంగా పునరావాసం కల్పించి వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. పేద ప్రజలు నివాసం ఉంటున్న భూములే పాలకులకు అవసరమయ్యాయా అని ప్రభుత్వాన్ని విమర్శించారు. ఈ సమస్యపై తహశీల్దార్ టి.కళ్యాణ్ చక్రవర్తికి వినతిపత్రం అందించారు. తహశీల్దార్ బాధితులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి బాధితులకు న్యాయం చేసేలా చూస్తామని హామీఇచ్చారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మొజ్జాడ యుగంధర్, ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సిహెచ్ రవి, ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి హరి ప్రసాద్, బాధితులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సబ్‌ప్లాన్‌ను పక్కాగా అమలు చేయాలి



మాట్లాడుతున్న సుబ్బారావు

ప్రజాశక్తి– పలాస

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టం పక్కాగా అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్ పిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు అన్నారు. కాశీబుగ్గలోని దళిత కమ్యూనిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు నిండినప్పటికీ నేటికి కులవివక్షత, దాడులు, సరైన విద్య, వైద్యం అందక దళితులు నేటికి వెనుకబడి ఉండే పరిస్థితి ఏర్పడిందన్నారు. కుల నిర్మూలన జరగడానికి పాలకులు ప్రయత్నం చేయాలన్నారు. ప్రతి ఒక్కరికి విద్య, వైద్యం అందాలన్నారు. ఎన్నో పోరాటాలు చేసి సుప్రీం కోర్టు నుంచి తెచ్చుకొన్న అట్రాసిటీ యాక్ట్ ఎస్‌సి, ఎస్‌టిలకు రక్షణగా ఉండేదని దీనిని కూడా నిర్లక్ష్యం చేశారన్నారు. దళితవాడలకు, శ్మశానాలు, రహదారులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ కుటుంబానికి రెండెకరాల భూమి అందించి, ఇంటి నిర్మాణం చేసి అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు కోళ్ల చిన్నారావు, ప్రధాన కార్యదర్శి పిట్ట గోపి, ఉపాధ్యక్షుడు బాదాపు వాణి, డివిజన్ అధ్యక్షులు ఎన్. ఖైలాస్, టెక్కలి డివిజన్ అధ్యక్షులు పి.భాస్కరరావు, నియోజకవర్గ అధ్యక్షులు విజయ్ నాయక్, పలాస అధ్యక్షులు బోనెల గోపి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చక్రతీర్థ స్నానాలు

ప్రజాశక్తి– సరుబుజ్జిలి

మండలంలోని పురుషోత్తపురం గ్రామంలో శుక్రవారం ఉమా కామేశ్వర స్వామి చక్ర తీర్థ స్నానాలు ఘనంగా నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా గత మూడురోజులు నిర్వహించిన ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఆలయ ప్రధాన అర్చకులు గంగవరపు వాసుదేవ శర్మ ఆధ్వర్యంలో ఉత్సవ విగ్రహాలను దేవాలయం నుంచి ఊరేగింపుగా నది వరకు తీసుకువెళ్లి నదిలో చక్రతీర్థ స్నానాలు నిర్వహించారు. కార్యక్రమంలో పరిసర ప్రాంత గ్రామాలకు చెందిన యాత్రికులు పాల్గొని వంశధార నదిలో పుణ్య స్నానాలను ఆచరించారు.

టెక్కలి రూరల్: టెక్కలి మండలం రావివలస శ్రీ ఎండల మల్లికార్జునస్వామి ఆలయంలో జరుగుతున్న మహాశివరాత్రి ఉత్సవాలు చక్రతీర్థ స్నానాలు ముగిశాయి. దేవాదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో శుక్రవారం గ్రామంలో స్వామివారి తిరువీధి మహోత్సవం నిర్వహించారు. మూడు రోజుల ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టిన అనంతరం తిరువీధి, చక్రతీర్థ స్నానం నిర్వహించారు. ఆలయ ఇఒ గురుణాధరావు, అర్చకులు, సిబ్బంది ఉన్నారు.



సరుబుజ్జిలి : స్వామి వారికి స్నానం చేస్తున్న పురోహితులు



మాట్లాడుతున్న జగన్నాథం నాయుడు

అభివృద్ధిని ఓర్వలేక విమర్శలు

ప్రజాశక్తి– రణస్థలం రూరల్

పంచాయతీలో ఐదేళ్లుగా నిలిచిపోయిన అభివృద్ధి పనులను తాను చేస్తుంటే కొంతమంది ఓర్వలేక తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని టిడిపి సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ పిసిని జగన్నాథం నాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. కోష్టాలో కొన్నేళ్లుగా స్మశాన వాటికకు రహదారి లేక ప్రజలు ఎన్నో అవస్థలు పడుతున్నారన్నారు. ఈ రహదారి ఏర్పాటు నిమిత్తం గతేడాది ఆగస్టు 23న గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావుకు గ్రామ యువకులు వినతిపత్రం అందజేశారని తెలిపారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలోను స్థానిక యువకులు వినతిపత్రాన్ని అందించారన్నారు. ఈ మేరకు గ్రామ సర్పంచ్ అభివృద్ధి పనులపై దృష్టి మరల్చకపోవడంతో గ్రామ ప్రజల ప్రయోజనార్థం, వారి అవసరాల కొరకు ఇటీవల పలు సిసిరోడ్లు వేయిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే స్మశాన వాటిక రోడ్డు నిమిత్తం బుధవారం జెసిబితో మట్టి తవ్వకం చేపట్టామన్నారు. ఈ క్రమంలో అడ్డుగా ఉన్న మొక్కలను తొలగించి, పక్కనపెట్టి తర్వాత వేరే స్థానంలో నాటామన్నారు. అభివద్ధి పనులను చూసి ఓర్చుకోలేని ఫీల్డ్ అసిస్టెంట్ కొంతమంది స్థానికులతో కలిసి తనపై తప్పుడు వార్త కథనాలు ప్రచురితమయ్యేలా చేశారన్నారు. గతంలో లక్షలాది రూపాయల బిల్లులు రాకపోయినప్పటికీ పంచాయతీని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో పనులు చేపడుతున్న తనపై దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. విఆర్ఒ అప్పల నాయుడు మాట్లాడుతూ ఈ పనులన్నీ రెవెన్యూ అధికారి దృష్టిలో పెట్టి చేశారని తెలిపారు. సమావేశంలో కార్యదర్శి శ్రీధర్, ఎంపిటిసి ప్రతినిధి పిసిని ఆసిరినాయుడు, ఎంపిటిసి మాజీ సభ్యులు పైడి అప్పడుదొర, సచివాలయం సర్వేయర్ ఈశ్వరరావు, కూటమి నాయకులు లక్షణరావు, చిన్న పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో మేలైన దిగుబడి

కవిటి: రబీ సీజన్‌లో యాజమాన్య పద్ధతుల ద్వారా మేలైన దిగుబడి సాధించవచ్చని ఎఒ బడగల దుర్గాప్రసాద్ అన్నారు. మండలం మాణిక్యపురంలో వరి పంటలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంటకు ఒక ఎకరానికి 25 కిలోల యూరియా, 15 కిలోలు పొటాష్, చిరుపొట్ట దశలో 25 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ వేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా వరిలో తాటాకు తెగులు (హిస్పా పురుగు), పొడతెగులు ఉన్నట్లయితే ప్రొఫెనోపాస్ 2ఎం.ఎల్, హెక్సాకోనజోల్ 2 ఎం.ఎల్ ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు అన్వేష్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

సమావేశం బహిష్కరణ

ప్రజాశక్తి– టెక్కలి రూరల్

మేజర్ పంచాయతీ సర్వసభ్య సమావేశాన్ని వార్డు మెంబర్లు బహిష్కరించారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఉందని పంచాయతీ కార్య నిర్వాహణాధికారి ఎజెండా పంపించినప్పటికీ వార్డు మెంబర్లు కొంతమంది హాజరు కాలేదు. కొంతమంది వచ్చి బహిష్కరించారు. తాము ఏం చెప్పినా పనులు కావడం లేదని, టిడిపి వారే చెప్పినవే ఇఒ చేస్తున్నారని అందుకే ఈ సమావేశం బహిష్కరించామని వార్డు సభ్యులు దాడి ధర్మారావు, పీత రమణ, పాట లోకేశ్వరరావు తెలిపారు. ఏడాదిగా పంచాయతీ సమావేశాలు జరిగినప్పటికీ ప్రతి సమావేశంలో ఎజెండాలో ఉన్న అంశాలను వార్డు సభ్యులు తిరస్కరిస్తూ వచ్చారు. ఇప్పటికైనా ఇఒ చొరవ తీసుకొని సమస్య పరిష్కారానికి కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న యాత్రికులు

రాపాకలో అన్నదానం

ప్రజాశక్తి– పొందూరు

మండలంలోని రాపాకలో వరలక్ష్మి పేరంటాలు అమ్మవారి 5వయాత్ర మహోత్సవాల సందర్భంగా శుక్రవారం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడురోజులు పాటు నిర్వహించే ఈ యాత్ర మహోత్సవాలు సందర్భంగా రెండోరోజు నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి పరిసర గ్రామాలకు చెందిన వేలాది మంది యాత్రికులు తరలివచ్చారు. అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, ప్రసాదరావు, అప్పలరాజు, రామకృష్ణ, త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.

టైలర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి– శ్రీకాకుళం అర్బన్

రడీమేడ్ వస్త్రాలతో టైలరింగ్ వృత్తిదారులకు పని లేకుండా పోతోందని, అందువల్ల ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందించి ఆదుకోవాలని ఎపి టైలర్స్ కోపరేటివ్ సొసైటీ పరిరక్షణ కమిటీ గౌరవాధ్యక్షులు ఎస్.పాపారావు కోరారు. నగరంలోని చౌక్ బజార్‌లో శుక్రవారం టైలర్స్ డే శ్రీకాకుళం టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించారు. ముందుగా టైలర్స్ అసోసియేషన్ జెండాను ఎగుర వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వినూత్న పద్ధతిలో వస్త్రాలను కుట్టి ప్రజలను ఆకట్టుకునేందుకు వీలుగా ప్రభుత్వం సహకారాన్ని అందించాలన్నారు. ఈసందర్భంగా కుట్టుమిషన్ సృష్టికర్త విలియం హార్వే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు.

అనంతరం నగరంలోని సోనీ టైలర్‌గా పేరున్న కృష్ణ అనారోగ్యంతో బాధపడుతుండడంతో అసోసియేషన్ ఆధ్వర్యాన రూ.10వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస పండా, అధ్యక్షులు వేణు, రాజు, కోశాధికారి కోరాడ తిరుమల తదితరులు పాల్గొన్నారు.



లావేరులో నిర్మిస్తున్న సిసి రోడ్డు

ప్రజాశక్తి– లావేరు

మండల కేంద్రం లావేరు పంచాయతీ లావేరులో ముమ్మరంగా సిసిరోడ్డు పనులు కూటమి నాయకులు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. అలాగే

చురుగ్గా సిసి రోడ్ల నిర్మాణం

లావేటిపాళెం, కేశవరాయపురం, జి.జి.వలస గ్రామాల్లో సిసి రహదారుల నిర్మాణం జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వంలో రోడ్లు, కాలువల నిర్మాణ పనులు చేపట్టడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర అన్నారు. ఈ సందర్భంగా పనులను పర్యవేక్షించారు. ఈయనతో పాటు టిడిపి నాయకులు లంకలపల్లి శ్రీనువాసరావు, ఎల్.ఆనంద్, నిడిగంటల త్రినాధ్, సీతారామరాజు, కృష్ణ, అనీల్‌కుమార్ తదితరులున్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి– పలాస

మండలం బొడ్డపాడులో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు మార్చి 1, 2న నిర్వహించ నున్నట్లు బొడ్డపాడు యువజన సంఘ అధ్యక్షుడు క్రాంతికుమార్ స్పష్టం చేశారు. బొడ్డపాడులో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 70 ఏళ్ల కిందట సమాజంలోని మూఢనమ్మకాల జాడ్యాన్ని తరిమి కొట్టెందుకు తమ సంఘం 1954లో ఏర్పాటైందన్నారు. గత నాలుగేళ్లుగా విద్యావ్యాప్తి, కళా రంగాల అభివృద్ధికి తమ సంఘం కృషి చేస్తున్నట్టు చెప్పారు. అలాగే గతంలో ఆ సంఘంలో బాధ్యతలు నిర్వహించిన తామాడ త్రిలోచనరావు తదితరులు మాట్లాడుతూ వ్యవస్థలో మార్పులు కోసం ఏర్పాటైన సంఘంగా అభివర్ణించారు. సమాజంలోని అసమానతలు తొలగించేందుకు ఈ సంఘంలోని సభ్యులు కొంతమంది ఉద్యమబాట పట్టినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా, 71వ వార్షికోత్సవ సందర్భంగా ప్రస్తుత యువత క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జైభీమ్ యువజన సంఘం అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు మాట్లాడుతూ ఆనాటి యువత త్యాగఫలమే బొడ్డపాడు ఖ్యాతి అని కొనియాడారు. ఈ ఉత్సవాల్లో జై భీమ్ యువజన సంఘం, స్త్రీ విముక్తి మహిళా సంఘం, అన్నదాత రైతు సంఘం, బొడ్డపాడు రైతు సంఘం, సైనిక్ యూనియన్‌లు బొడ్డపాడు యువజన సంఘంతో కలిసి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అయితే ఈ పోటీలను అడ్డుకునేందుకు కొన్ని శక్తులు కుట్ర పన్నుతున్నాయని ఆరోపించారు. క్రీడా స్ఫూర్తిని దెబ్బతీసే కుట్రలను ధీటుగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న క్రాంతి కుమార్

నేటి నుంచి చక్రధరుని డోలోత్సవ వేడుకలు

కవిటి: ఉద్దాన ప్రాంత ప్రజల ఆరాధ్య దైవం, భక్తుల కొంగు బంగారం శ్రీదేవి భూదేవి సమేత చక్ర పెరుమాళ్ స్వామి డోలోత్సవ వేడుకలు శుక్రవారం నుంచి వైభవోపేతంగా ప్రారంభం కానున్నాయి. మార్చి 1వ తేదీ ఫాల్గుణ శుద్ధ తదియ మొదలుకొని ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి మార్చి 14వ తేదీ వరకు అంగరంగ వైభవంగా స్వామి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 14వ తేదీ పౌర్ణమి రోజున నిర్వహించే స్వామివారి హోలీ పౌర్ణమి జాతర, 15వ తేదీ వేకువ జామున జరిగే కామదహనం, డోలాహరణం కార్యక్రమాలతో వేడుకలు ఘనంగా పరిసమాప్తమవుతాయని తెలిపారు. ఈ వేడు కలకు పరిసర గ్రామాలతో పాటు ఒడిశా నుంచి కూడా అధిక సంఖ్యలో యాత్రికులు హాజరు కానున్నట్టు తెలిపారు.

బడ్జెట్‌లో రైతులకు అన్యాయం



రాజు

కోటబొమ్మాళి: కూటమి ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారని వైసిపి మండల అధ్యక్షుడు సంపతిరావు హేమ సుందరరాజు అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ రైతులు గిట్టుబాటు ధరలేక అవస్థలు పడుతున్నారని, అన్నదాత సుఖీభవకు కూడా కూటమి సర్కార్ భారీగా కోత పెట్టిందని, ఈ పథకం ద్వారా రైతుకు రూ. 20 వేలు చొప్పున ఇస్తే రూ. 10 వేల 400 కోట్లు అవసరం కాగా కేవలం రూ.6,300 కోట్లు కేటాయించిందన్నారు. ఇక బడ్జెట్‌లో మహిళలు, నిరుద్యోగుల ఊసేలేదని, ఉచిత బస్సు మాటేలేదని ఆయన పేర్కొన్నారు.



సేంద్రీయ ఎరువులను విక్రయిస్తున్న కార్యదర్శి

సేంద్రీయ ఎరువు విక్రయం

ప్రజాశక్తి– రణస్థలం

మండలంలోని జె.ఆర్.పురం పంచాయతీలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో గ్రామంలో వ్యర్థాలను నిల్వ చేసి సేంద్రియ ఎరువుగా తయారు చేసి రెండు వేల కేజీల సేంద్రియ ఎరువును శుక్రవారం పాతర్లపల్లి గ్రామానికి చెందిన రైతులకు విక్రయించారు. కార్యక్రమంలో జె.ఆర్.పురం గ్రేడ్‌వన్ సెక్రటరీ ప్రసాద్, సానిటేషన్ మేస్త్రి పాణి కుమార్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

జల జీవన్ మిషన్ పనులు పరిశీలన

ప్రజాశక్తి– పొందూరు

మండలం రాపాకలో చేపడుతున్న జలజీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటా తాగునీటి పైపుల పనులను శుక్రవారం కూటమి నాయకులు పరిశీలించారు. ప్రతి ఇంటికి రక్షిత మంచి నీరు అందించాలని ఉద్దేశంతో రూ.1.16 కోట్లతో ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత కార్యదర్శి బలగ శంకర్ భాస్కరరావు, మండల తెలుగు యువత అధ్యక్షులు కండాపు శ్రీనివాసరావు, జనసేన నాయకులు కొంచాడ చిన్నం నాయుడు, జామాన అప్పలనాయుడు, కొంచాడ సన్యాసిరావు పాల్గొన్నారు.



తాగునీటి పైపులైన్ పనులు పరిశీలిస్తున్న నాయకులు